క్లుప్తంగా

వేపాడలో నేత్రవైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ గంగ

వేపాడ: మండల కేంద్రంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాల కేంద్రం వద్ద సోమవారం ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 48 మందికి ఆప్తాలమిక్ గంగ నేత్రపరీక్షలు చేసి 22 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేయించి, కళ్ల అద్దాలు అందజేయనున్నామని శంకర్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ జోగారావు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

2న గృహసారథుల సమావేశం

గంట్యాడ: మండలంలో వైఎస్సార్‌సీపీకి సంబంధించి నూతనంగా నియమితులైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఫిబ్రవరి 2న ఉదయం సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ పీరుబండి హైమావతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని కొూరుబిల్లి కనకదుర్గ ఆలయం సమీపంలో నిర్వహించే ఈసమా వేశానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు.

స్థల పరిశీలన

దత్తిరాజేరు: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సోమవారం స్థల పరిశీలన చేశారు. సమావేశానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడుకు సూచించారు.

పెరటి కోళ్ల పంపిణీ



పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ జ్ఞానదీపిక

గజపతినగరం: డ్వాక్రా సంఘాల సభ్యులకు స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక పెరటి కోళ్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు యూనిట్‌కు పది కోళ్లు, పది కిలోల దాణా అందిస్తున్నామని, ఈ ఆర్థిక సంవత్సరంలో మండలంలో 215 యూనిట్ల కోళ్లు పంపిణీ చేస్తామని చెప్పారు. వెలుగు ఏపీఎం యు.జగదీష్‌కుమార్, పురిటిపెంట సర్పంచ్ శొంఠ్యాన విజయలక్ష్మి, ఎంపిటీసీలు మండల సూర్యకళ, రేగలత పాల్గొన్నారు.

ఉత్సాహంగా 2కే రన్



2కే రన్‌ను ప్రారంభిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

శృంగవరపుకోట: అమర వీరుల సంస్మరణ దినోత్సవం, గాంధీజీ వర్ధంతి సందర్భంగా ధర్మవరం వాసవీక్లబ్ సభ్యులు సోమవారం 2కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ధర్మవరం ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పి.శ్రీరాములు నేతృత్వంలో నిర్వహించిన ఈ రన్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు వాసవీ క్లబ్ అధ్యక్షులు కె.సంతోష్, కార్యదర్శి కె.రవి, కోశాధికారి కె.సతీష్, కొల్లా శ్రీనివాసరావు తదితరులు పుస్తకాలు, పెన్నులు, పంపిణీ చేశారు.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

చీపురుపల్లిరూరల్: రైతులు ఎన్నోఏళ్లుగా ఎదుర్కొంటున్న భూసమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర భూరీసర్వేతో శాశ్వత పరిష్కారం లభించనుంద ని తహసీల్దార్ ఎం.సురేష్ అన్నారు. మండలంలోని మెట్టపల్లి, ఇటకర్లపల్లి పంచాయతీ పరిధి పి.ఎస్.లక్ష్మీపురం గ్రామాల్లో నిర్వహించనున్న భూసర్వేపై ఆయా గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. సర్వేచేసే సమయంలో పొలాల వద్ద రైతులు ఉండి, సర్వే సిబ్బందికి సహకరించాలని తహసీల్దార్ కోరారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం,వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు,ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దన్, రీసర్వే డీటీ నాగలక్ష్మి, ఆర్ఐ రామ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు చందక గురునాయుడు,ఎంపీటీసీ మీసాల ఈశ్వరరావు,మాజీ ఎంపీటీసీ మీసాల పైడితల్లి,ఇటకర్లపల్లి సర్పంచ్ మీసాల వెంకటరమణ, బైరెడ్డి కామేష్ పాల్గొన్నారు.

వావిలపాడు గ్రామదేవత తీర్థం

వేపాడ: మండలంలోని వావిలపాడులో రెండురోజుల పాటు నిర్వహించనున్న గ్రామదేవత పరదేశిమాంబ తీర్థమహోత్సవం సోమవారం ప్రారంభమైంది. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రెండోరోజు మంగళవారం సాయంత్రం ఎడ్ల పరుగు ప్రదర్శన,సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పెద్దకొడుకులా అండగా సీఎం జగన్

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి పెద్ద కొడుకులా, పేదలకు అండగా నిలుస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని, మళ్లీ ఆయన్ని అధికారంలో కి తీసుకురావాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని ధర్మవరం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన దృష్టికి వచ్చిన పలు సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్ల పనితీరుపై పలువురి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమది ప్రజా ప్రభుత్వమని, 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో ఏనాడైనా ఒక్క ఎమ్మెల్యే అయినా తన నియోజకవర్గం పరిధిలోని ప్రతి గడపకూ వెళ్లి ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, పరిష్కరించిన సందర్భాలను చూశామా అని ప్రజలను ఆరా తీశారు. సీఎం జగన్ ఆదేశాలతో మీ కోసమే గడప గడపకూ వస్తున్నామని చెప్పారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ఒకటో తేదీ ఉదయాన్నే తలపుతట్టి అవ్వా, తాతలకు వలంటీర్ల ద్వారా పింఛన్ అందజేస్తున్నామని, ప్రభుత్వ సేవలను సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు చేరువచేశామని అన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులు, కళాశాలలను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ కనకమహాలక్ష్మి, నాయకులు అల్లు మహాలక్ష్మునాయుడు, జి.పైడితల్లి, ఏ.సుధీర్, లగుడు అవతారం వర్రి కృష్ణ, మమ్ములూరి సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తరలించాలని వినతి



ఎమ్మెల్యే అప్పలనరసయ్యకు వినతిపత్రం అందజేస్తున్న మరుపల్లి గ్రామస్తులు

గజపతినగరం: మండలంలో మరుపల్లి గ్రామం నడి బొడ్డున నిర్వహిస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని గ్రామ శివారుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ మాజీ వైస్ సర్పంచ్ మహదేవ్‌రామునాయుడు, గ్రామస్తులు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను సోమవారం వారు కలిసి సమస్యను వివరించారు.మద్యం దుకాణం గ్రామం మధ్యలో ఉన్నందున సమీప నివాస కుటుంబాల వారు ఇబ్బందులు పడుతున్నారని గ్రామ పెద్దలు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, దుకాణం తరలించే అవకాశాలను పరిశీలిస్తామని చెప్పారు.

నేడు 'గడపగడపకు మనప్రభుత్వం'

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం బొండపల్లి సచివాలయం పరిధిలోని గొట్నంది గ్రామంలో మంగళవారం సాయంత్రం' గడపగడపకు మన ప్రభు త్వం' కార్యక్రమం నిర్వహించను న్నట్లు ఎంపీడీఓ జి.భాస్కరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. మండల అధికారులు, సంబంధిత సచివాల య ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

ఇప్పలవలసలో..

మెరకముడిదాం: మండలంలోని ఇప్పలవలస గ్రామంలో మండల ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల అధికారులు, సంబంధిత సచివాలయ ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రెల్లి భూములు ఏపీఐఐసీకి కేటాయించొద్దు



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అప్పన్నదొరపాలెం గిరిజనులు

కొత్తవలస: మండలంలోని రెల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 1-8లో 158.42 ఎకరాల భూమిని ఏపీఐఐసీకి బదలాయింపును వ్యతిరేకిస్తూ అప్పన్నదొరపాలెం గ్రామానికి చెందిన గిరిజనులు సోమవారం ఆందోళన చేశారు. డిప్యూటీ తహసీల్దార్ హర్షవర్ధినికి వినతిపత్రం అందజేశారు. గతంలో గిరిజన వర్సిటీ ఏర్పాటు చేస్తామని మా దగ్గర తీసుకున్నారని, ఇప్పుడు ఏపీఐఐసీకి బదలాయించడం సరికాదని, తమ భూములు తిరిగి ఇచ్చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డేగల అప్పలరాజు, ఉగ్గిన నాగరాజు, యు.పాండవులు, నూకమ్మ పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజానికి కృషి



కుష్టు నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న జామి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది



వేపాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



బొద్దాంలో హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సతీష్‌కుమార్



ర్యాలీ నిర్వహిస్తున్న వియ్యంపేట వైద్య సిబ్బంది

కుష్టు వ్యాధి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని, ఇందులో అంతా భాగస్వాములు కావాలని వైద్యాధికారులు పిలుపునిచ్చారు. కుష్టు వ్యాధి అవగాహన పక్షోత్సవాల్లో భాగంగా 'స్పర్శ' పేరుతో ప్రజలకు వైద్య సిబ్బంది సోమవారం అవగాహన కల్పించారు. వేపాడ మండల కేంద్రం, బొద్దాంలో స్థానిక పీహెచ్‌సీల వైద్యాధికారులు ధరణి, సతీష్ కుమార్, కొత్తవలస మండలంలోని వియ్యంపేట, తుమ్మికాపల్లి గ్రామాల్లో ఆయా గ్రామాల పీహెచ్‌సీల వైద్యాధికారులు ఈ.గోపాలకృష్ణ, బి.సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. జామి పీహెచ్‌సీలో సిబ్బందికి వైద్యాధికారి ఎస్.భాగ్యరేఖ అవగాహన కల్పించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని రాగి రంగు మచ్చలు ఉంటే సమీప పీహెచ్‌సీల్లో లెప్రసీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందని తెలిపారు. కుష్టు వ్యాధి గ్రస్తులపై వివక్ష చూపించవద్దని అన్నారు.

\- వేపాడ, జామి, కొత్తవలస రూరల్

సంక్షిప్తంగా...

రామాలయ పునః ప్రతిష్ఠోత్సవాలు

దత్తిరాజేరు: ఆర్.రామచంద్రాపురంలో రామాలయ పునఃప్రతిష్టాపన ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడురోజులు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ప్రత్యేక పూజలు, హోమం చేశారు. బుధవారం అన్నదానం చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఫ్యామిలీ కౌన్సిలింగ్

శృంగవరపుకోట: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఎస్.కోట ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ కె.రమేష్ నేతృత్వంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. పలువురు డ్రైవర్లను వారి కుటుంబ సభ్యులను సమావేశ పరిచి, డ్రైవర్లు శారీరకంగా, మానసికంగా ఎటువంటి ఆరోగ్యంతో ఉండాలి, వారి ఆరోగ్యస్థితి ప్రయాణికులపై ఎలాంటి ప్రభావం చూపుతుంది, వారికి కుటుంబ సభ్యుల నుంచి ఎటువంటి సహకారం అందివ్వాలి అన్న అంశాలను వివరించారు. అనంతరం డ్రైవర్ల భార్యలకు పండ్లు, జాకెట్ పీస్‌లు ఇచ్చి అభినందించారు. ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ సన్నిబాబు పాల్గొన్నారు.

గొడౌన్ నిర్మాణానికి భూమి పూజ రేపు

దత్తిరాజేరు: పోరలి గ్రామం వద్ద గొడౌన్ నిర్మాణానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య బుధవారం భూమిపూజ చేయనున్నారని వెలుగు ఏపీఎం అచ్యుతరావు సోమవారం తెలిపారు. రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు రూ.13 లక్షలతో గొడౌన్ నిర్మిస్తున్నట్లు చెప్పారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన

చీపురుపల్లి:అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాల ని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు కోరారు. పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ఆందోళన చేశా రు. ఫేస్ యాప్ హాజరు విధానాన్ని రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని కోరారు.

ఫిబ్రవరి 6న కలెక్టరేట్ వద్ద ధర్నా

గజపతినగరం: అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 6న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ నాయకురాలు పి.జ్యోతి తెలిపారు. ఆరోజు అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీవర్కర్లు, హెల్పర్లకు ఆరోజున సామూహిక సెలవు ఇవ్వాలని కోరుతూ ఐసీడీఎస్ పీఓ నాగమణికి సోమవారం వినతిప్రతం అందజేశారు.

సులభంగా అర్థమయ్యేలా బోధన

గజపతినగరం:విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని ఎంఈఓ విమలమ్మ ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక ప్రభుత్వబాలుర హైస్కూల్‌లో 3,4,5వతరగతులకు బోధిస్తున్న ఉపాధ్యాయులతో సోమవారం ఆమె సమావేశమయ్యారు. పిల్లల వర్క్ బుక్‌ల మూల్యాంకన, ఇతర అంశాలపై ఉపాధ్యాయులను ఆరా తీశారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించండి

బొండపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా సక్రమంగా అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎంపీడీఓ ఏ.వేదవతి సూచించారు. బిల్లలవలస,కెరటాం అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం ఆమె తనిఖీలు నిర్వహించారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

గజపతినగరం రూరల్: రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాతబగ్గాం సచివాలయం వద్ద రైతులతో కలిసి సోమవారం ధర్నా ని ర్వహించారు. సచివాలయం పరిధిలోని బంగారమ్మపేట, భూదేవి పేట రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయలేదని ఆయన ఆరోపించారు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని కోరా రు.

నేడు పెదవేమలిలో వైద్యశిబిరం

గంట్యాడ: పెదవేమలి గ్రామంలో హీలింగ్ హ్యూమన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆటో స్టాండ్ వద్ద మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ ఫౌండేషన్ అధ్యక్షుడు ఇమ్మానుయేలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో బీపీ, ఈసీజీ, రక్త, తదితర వైద్య పరీక్షలను డాక్టర్ సీహెచ్.వేణుగోపాలరెడ్డి చేస్తారని పేర్కొన్నారు.

ఉపాధి పనులు, పథకాల అమలుపై ఆరా



బానాదిలో అధికారులు, ప్రజలతో సమావేశమైన కేంద్ర బృందం

వేపాడ/ లక్కవరపుకోట: వేపాడ, ఎల్.కోట మండలాల్లోని బానాది, ఆతవ, జమ్మాదేవిపేట పంచాయతీల్లో కేంద్ర బృందం (ఒడిశాకు చెందిన రీసెర్చ్ ఇన్నొవేషన్ సెంటర్ అధికారులు) సోమవారం పర్యటించింది. ఆయా పంచాయతీల్లో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల అధికారులు, ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులతో కేంద్ర బృందంలోని అధికారులు గిరిజా శంకర్ పాండే, సత్యరంజన్ రౌత్ సమావేశమయ్యారు. ఉపాధి వేతనాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజలను ఆరా తీశారు.డ్వాక్రా సంఘాలకు అందిస్తున్న సున్నావడ్డీ రుణాలు, ఆయా పంచాయతీల్లో వేతనదారులు చేసిన ఉపాధి పనులు, బిల్లుల చెల్లింపులు, సచివాలయ, రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణాలకు వెచ్చించిన నిధులు, ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలు, ఖర్చు చేసిన నిధులు, ఇళ్ల నిర్మాణాల గురించి ఆయా శాఖల అధికారులు కేంద్ర బృందానికి వివరించారు. పనులు, పథకాల అమలుపై కేంద్ర బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. బానాదిలో అభయాంజనేయ స్వామి డ్వాక్రా గ్రూపు సభ్యులు నిర్వహిస్తున్న దుస్తుల దుకాణం, కనకదుర్గ సంఘం సభ్యులు నిర్వహిస్తున్న పిండిమిల్లు, కోళ్ల ఫారాలను, ఆతవలో ఇళ్ల నిర్మాణాలను కేంద్రబృందం పరిశీలించింది. వారి వెంట ఎంపీడీఓలు పట్నాయక్, కె.రూపేష్, ఉపాధి హామీ ఏపీడీలు శాంతకుమారి, శారదాదేవి, హౌసింగ్ డీఈ శ్రీనివాస్, ఏఈ అప్పలనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రకళ, ఈఓపీఆర్డీలు జ్ఞానేశ్వరరావు, సూర్యనారాయణ, వెలుగు ఏపీఎంలు శ్రీనివాసరావు,అప్పలనాయుడు, ఉపాధి ఏపీఓ సన్యాసినాయుడు , పంచాయతీ రాజ్ ఏఈ ఆలీ,ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సీహెచ్‌ఓ ఆంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, ఆయా గ్రామాల సర్పంచ్ లు కర్రి యశోద, వేమన నాయుడు, సత్యవతి, ఎంపీటీసీలు గొంప తులసి,రాజీవ్ ఉన్నారు.

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేయాలి

- అదనంగా 18,998 టన్నుల కొనుగోలుకు అనుమతులు
- అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే కడుబండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కడబండి శ్రీనివాసరావు

కొత్తవలస: రైతులు నుంచి ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేయాలని కొత్తవలస సబ్‌డివిజన్ పరిధి వ్యవసాయ, సీఎస్‌డీటీలకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సూచించారు. కొత్తవలసలోని తన క్యాంపు ఆఫీసులో ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవర్గంలో రైతులు ఎక్కువగా సాగు చేసే పంట వరి అని అన్నారు. రైతుల అందరి నుంచీ ధాన్యం సేకరించాలని,అలాగే రైతుల బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు వ్యవసాయశాఖ జెడీ త్రినాథస్వామి మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతో నియోజకవర్గం పరిధిలో అదనంగా 18,998 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని తెలిపారు.నియోజకవర్గంలో ఇప్పటి వరకు 32,541 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. మొత్తంగా 74 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని చెప్పారు. ప్రస్తుతం అదనంగా ఎస్.కోట మండలంలో 3,778 మెట్రిక్ టన్నులు, వేపాడలో 3,500, లక్కవరపుకోటలో 3,587, జామిలో 7,933,కొత్తవలస మండలంలో 200 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. వ్యవసాయశాఖ కొత్తవలస సబ్‌డివిజన్ సహాయ సంచాలకులు ఎల్.విజయ, అయిదు మండలాల సీఎస్‌డీటీలు, ఎల్.కోట జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ 75 శాతం పూర్తి



మాట్లాడుతున్న ఎంపీపీ చలం నాయుడు

బొండపల్లి: మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు 75 శాతం పూర్తయ్యాయని ఎంపీపీ చల్ల చలం నాయుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ-క్రాప్ చేయించుకున్న రైతులకు సంబంధించి ఇంకా కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని, రైతుల వివరాలను జియోట్యాగింగ్ చేసి శతశాతం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని చెప్పారు. ఇంకా రైతులు వద్ద ఎంత ధాన్యం ఉందో వ్యవసాయశాఖ అధికారులు వివరాలు సేకరించి, కొనుగోలు చేసే పనిలో నిమగ్నమ య్యారని వివరించారు. గతేడాది కంటే లక్ష్యానికి మించి ఇప్పటికే ఎక్కువ సేకరించినప్పటికీ ఇంకా రైతుల వద్ద ధ్యానం ఉన్నట్లు గుర్తించామన్నారు. ధ్యానం సేకరించాలని కోరుతూ బి.రాజేరు సచివాలయం వద్ద కొంత మంది రైతులతో కలిసి రైతు సంఘం నాయకులు ఆందోళన చేయడం సరి కాదన్నారు. అక్కడ ముందుగానే కొంతమంది దళారులు రైతుల వద్ద నుంచి ధ్యానం కొనుగోలు చేసి నిల్వ చేశారని, దళారుల నుంచి ప్రభుత్వం ధాన్యం సేకరించడంలో జాప్యం చేస్తోందంటూ అందోళన చేయడం సమజసం కాదన్నారు. రైతులు అందరి నుంచి ధాన్యం సేకరిస్తామని ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు.

ధాన్యం నిల్వల వివరాలు సేకరించాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా రైతులు నూర్పులు చేసి కళ్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వివరాలను సేకరించాలని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ అనురాధ, తహసీల్దార్ రమేష్, వీఏఏలతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల వారీగా రైతులు వద్ద ధాన్యం నిల్వల వివరాలను మంగళవారం సాయంత్రం నాటికి అందజేయాలని ఆదేశించారు. ఈ-క్రాప్‌లో పంట వివరాలు నమోదు చేసుకున్న రైతుల వివరాలను కూడా పొందుపరచాలని సూచించారు. సాంకేతిక సమస్య వల్ల నిలిచిన ధాన్యం సేకరణ సోమవారం నుంచి ప్రారంభమైందని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని ఏఓ అనురాధ అన్నారు.

జాతిపితకు ఘన నివాళి

జాతిపిత మహాత్మగాంధీజీ వర్ధంతి సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో గాంధీ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు ఆర్య వైశ్య సంఘాల నాయకులు పూలమాలలు వేసి అంజి లి ఘటించారు. శృంగవరపుకోట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయమూర్తి ఎస్.వాణి నేతృత్వంలో కోర్టు సిబ్బంది, న్యాయవాదులు రెండు నిముషాలు మౌనం పాటించారు.

\- శృంగవరపుకోట, కొత్తవలస, చీపురుపల్లి, చీపురుపల్లిరూరల్, జామి



శృంగవరపుకోట: ఎస్.కోట మున్సిఫ్ కోర్టులో మౌనం పాటిస్తున్న న్యాయమూర్తి వాణి, న్యాయవాదులు



కొత్తవలస: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న డీటీ హర్షవర్ధిణి, రెవెన్యూ సిబ్బంది



లక్కవరపుకోట: గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు



చీపురుపల్లి: బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చీపురుపల్లి రూరల్: గరివిడిలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు



శృంగవరపుకోట: ధర్మవరం హైస్కూల్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు



శృంగవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



జామి: భీమసింగిలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు



శృంగవరపుకోట: ఎస్.కోటలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాసవీయూత్ క్లబ్ సభ్యులు